# నేను మీ నాన్ననమ్మా!

– శ్రీమతి న్యాయపతి కమలారాంజీ




నేను సుబ్బారావుని! కాని నేనే సుబ్బారావుని అని ఎంత గొంతు చించుకుని చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. నావైపే చూడ్డం లేదు!

నా రూపం నేనే పోల్చుకోలేనంతగా మారిపోయింది! నా వాళ్లందరూ.... నా భార్య నా కొడుకు, యిద్దరు కూతుళ్ల ఎవరూ.... నన్ను పోల్చుకోలేకపోతున్నారు! హయ్యో! నేనిప్పుడు.... ఏం చెయ్యడం....? ఏం చెయ్యగలను కనుక? నా మనసులో ఎన్నో ఆలోచనలు వున్నాయి. కాని అవన్నీ ఎవరిక్కావాలి? అసలు నేనే ఎవరికీ అక్కర్లేదు! ఇహ నా మనసు గురించి వాటి ఆలోచనల గురించి ఎవరికి బాధ?! బాధంతా నాకే!

నా యింటి ముందు నేను నించున్నాను. లోపలికి వెళ్లడానికి ఏదో జంకు! భయం! నన్ను వాళ్లు రానిస్తారో, లేదోనని భయం. వాళ్లని నేను ఎంత హింసించేను....!

రోజూ రాత్రుళ్లు తాగొచ్చి సత్యవతిని.... అదే.... నా భార్యని చితకబాదే వాడ్ని. జుట్టుపట్టుకుని ఈడ్చి తన్నే వాడ్ని. సత్యవతి కుమిలి కుమిలి ఏడ్చేది. భూదేవికున్నంత ఓర్పు నా భార్యకుంది.

“ఇంతగా తాగితే మీ వళ్లు పాడవుతుందండీ. ఆ తాగుడు మానండి అంటే వినరు.” అనేది. నా చేత దెబ్బలు తిన్నందుకు తనికి బాధలేదు. నా వళ్లు పాడవుతుందిన దానికి బాధ! పాపం పిచ్చి సత్యవతి! ఎంతమంచిది. అలాంటి దాన్ని పట్టుకుని కొట్టడానికి నాకు చేతులు ఎలా వచ్చేయో?!” నేను సత్యవతిని తల్చుకుని చాలా బాధపడిపోయాను. బయటనే ఒక మూల కూర్చున్నాను.

ఆలోచనలు నా మనసు చుట్టూ కందిరీగల్లా ముసురుకున్నాయి......

మూడు రోజులైంది క్లబ్బులో పేకాట.... తాగుడు.... తాగుడు.... మత్తులో వున్నాను. ఇంటి క్కూడా వెళ్లకుండా జీతం డబ్బులన్నీ పేకాటలో పోగొట్టుకుని బార్‌లో బాకీ పెట్టి మరీ తాగాను. మూడు రోజుల తర్వాత యిల్లు గుర్తొచ్చి యింటికి వచ్చాను. నా భార్య నా కోసం ఏడుస్తూ గుమ్మం లోనే నించుంది. ఆ ఏడుపు మొహం చూస్తే నాకు చెప్పలేనంత అసహ్యం వేసింది.

“ఎందుకీ? వెధవ ఏడుపూ. నువ్వూనూ, రోజూ ఏడుపు మొహంతోనే వుంటావు ఏదో కొంపలంటుకు పోతున్నట్టు! అందుకే పేకాటలో అంతా పోతున్నది. మొగుడన్న వాడు కష్టాల్లో వుంటె డబ్బు సర్దుబాటు చెయ్యడం తెలీదు. కాని ఏడవడం మాత్రం బాగా వచ్చు.” అని నా పెళ్లాన్ని బర బరాలోపలికి యీడ్చుకు వెళ్లి నేను అలసి పోయిందాకా కొట్టాను. నా పెద్ద కూతురు సునీత అడ్డు పడింది.

“ఏంటి నాన్నా యిది? మీ కోసం మూడు రోజుల బట్టి అన్నం, నీళ్లు ముట్టకుండా ఏడుస్తూ కూర్చుంది. అలాంటి దాన్ని పట్టుకుని కొట్టడానికి అసలు మీకు చేతులెలా వచ్చాయి?” అంది నిలదీస్తూ.

నాకు సునీత మీద కోపం వచ్చింది. బి.కామ్. పాసయి ప్రయివేట్ కంపెనీలో వుద్యోగం చేస్తూ

యింటి బరువు - బాధ్యతలని తన నెత్తి మీద వేసుకుంటుదన్న సంగతి నాకా సమయంలో గుర్తుకు రాలేదు.

తాగిన మత్తు యింకా వదల్లేదు నాకు.

"ఏంటి! పెద్దా - చిన్నా లేకుండా ఆ వాడుగు! మన యింటా - వంటా లేదు పెద్దవాళ్లకి ఎదురు జవాబులు చెప్పడం!" అరిచాను నేను.

"తాగుడు మన యింటా - వంటా వుందా?" అంది రకీమని.

వెంటనే చాచి లెంపకాయ కొట్టాను దానికి. సునీతకి కళ్లు బైర్లు కమ్మేయి. అక్కడే చతికిలపడి పోయింది. సత్యవతి ఓ మూల కూర్చుని ఏడుస్తూ వుంది.

నా కొడుకు చంద్రం యింకా చిన్నవాడు. హై స్కూల్లో చదువుతున్నాడు. నాకేకలకి భయపడి పక్క గదిలోకి పారిపోయాడు. నేను వాళ్ళ ఖర్మానికి వాళ్లని వదిలేసి గదిలోకెళ్లి పడుకున్నాను. ఉదయం లేచే సర్కి మత్తు దిగిపోయింది.

సత్యవతి వంట చెయ్యలేదు. నేను ఏమీ తినకుండానే బ్యాంకుకెళ్లిపోయాను. నేను బ్యాంకు కేషియర్ని. అప్పటికే చాలా కేష్ చాకచక్యంగా నొక్కేసాను. కాని విధి వక్రించింది. ఎవరి మోసాలైనా ఎన్నాళ్లు దాగుతాయి?! నాకు ఛార్జ్ షీట్ యిచ్చారు. అయినా నా దురలవాటు నేను మాన లేదు. ఆ రోజు నేను బ్యాంకుకెళ్లేసర్కి సస్పెన్షన్ ఆర్డర్ చేతిలో పెట్టారు. 'సిగ్గు'ని అక్కడే వదిలేసి యింటికి వచ్చాను.

ఇప్పుడు కూతురి జీతం మీదే ఆధారపడి బ్రతుకుతున్నాం అందరం. అయినా మందు కొట్టడం మానలేదు. ఇంట్లో వాళ్లకి తెలియకుండా యింట్లో వున్న విలువైన వస్తువులన్నీ కరిగి పోయినా, తాగుడుకి ఈ మధ్య కొత్తగా దగ్గు పట్టుకుంది. విపరీతమైన దగ్గు. గొంతులోని నరాలన్నీ చిట్లి పోయేటంత యిదిగా దగ్గు. అలా దగ్గుతున్నప్పుడు రక్తం కూడా పడుతోంది.

నా భార్య ఏడుస్తూ నన్ను డాక్టరుకి చూపించింది.

"లివర్ పూర్తిగా పాడయిపోయింది. తాగుడు పూర్తిగా మానెయ్యాలి. మానేసినా ఎన్నాళ్లు బ్రతుకు తారో చెప్పడం కష్టం." డాక్టరు నా పెళ్లాంతో చెప్తూంటే విన్నాను. నాకేం షాకనిపించలేదు.

ఎక్కడికీ వెళ్లకుండా యింట్లోనే వుండే విధంగా గట్టి బందోబస్తే చేసింది నా పెద్ద కూతురు. నా భార్య ఏడుస్తూనే నాకు సేవలు చేస్తోంది.

రమ్య నా చిన్న కూతురు. కాలేజీలో చదువుతోంది. దాని పరీక్ష ఫీజు కోసమని సునీత, సత్యవతి చేతికి డబ్బు యిస్తూంటే చూశాను నేను. నా పెళ్లాం ఆ డబ్బుని డ్రాయర్లో పెట్టింది. అంతే! దాన్ని వంటింట్లోకి వెళ్లనిచ్చి ఆ డబ్బుని తీసుకుని మెల్లగా ఎవరూ చూడకుండా బయటకు నడిచాను. నా కాళ్లు - చేతులు పటుత్వం తగ్గిపోయింది. నా కాళ్లు వణుకుతూనే క్లబ్బుకి దారి తీశాయి!

అప్పటికే నేను బాగా శుష్కించి పోయి వున్నాను. గడ్డం బాగా పెరిగింది. షేవింగ్ చేసుకునే ఓపిక లేక నేనే గడ్డం పెంచేశాను. మంచి బట్టలు కట్టుకుని ఎన్నాళ్లో అయిపోయింది. కాని అవేవీ నాకు ముఖ్యం కావు. నా కూతురు పరీక్ష కట్టడం.... పాసవడం కూడా నాకు ముఖ్యం కాదు. ఆ నిముషంలో నా కళ్ల ముందు విస్కీ సీసా వివిధ భంగిమల్లో కనబడుతోంది. నా గొంతు తడుపుకుని చాలా రోజులైంది. అలవాటయిన ప్రాణం. వుండలేకపోతున్నాను. ప్రాణం కొట్టుకు పోతోంది. అందుకే ఏదయితే అయిందని వచ్చేశాను.

ఒక పెగ్ గొంతు దిగగానే స్వర్గం చేరువలో వున్నట్టనిపించింది. అలా.... అలా.... అయిదారు పెగ్‌లు లాగించాను. అయినా తనివి తీర లేదు. వళ్లు వణుకుతోంది. తూలుతోంది. లేచి నించోవ డానికి ప్రయత్నించాను. కాని కళ్లు - కాళ్లు తేలి పోతున్నాయి. వంట్లోని శక్తినంతా ఎవరో లాగేస్తు న్నట్టు అనిపించింది. దబ్బున పడిపోయాను. అంతే. ఆ తర్వాత..... ఈ ప్రపంచంతో సంబంధం లేకుండా ఎక్కడికో వెళ్లిపోతున్నట్టుగా.... ఎంత అనుభూతి! శరీరం.... తేలిగ్గా.... దూది పింజెకన్నా తేలిగ్గా అయిపోయినట్టు భావన!

ఆ తర్వాత.... ఆ తర్వాత... నా యింటి దగ్గరకి నేనొచ్చేసర్కి ఎన్నాళ్లో అయిపోయినట్టుగా.... చిత్రమైన అనుభవం! ఎన్నాళ్లయిందో నా పెళ్లాం, పిల్లల్ని చూసి.

## విద్య - విశిష్టత!

ఆ.వె. నీకు ధనము వున్న, నిన్ను దోచాలని
ఆశ పడుదు రంత, అవని మీద,
నీకు విద్య వున్న నీవు దోచబడవు!
మిత్రమా! మరువకు మేటి మాట!

ఆ.వె. చదువు వున్న, కలుగు చక్కని నడవడి
క, నడవడిక చక్కగైన, వెలుగు
నిండు నేల నిండ, నీ తేజము వలన!
మిత్రమా! మరువకు మేటి మాట!

ఆ.వె. అధిక ధనము వున్న, ఆదరం నీ ఊరు
నిండె నీకు వుండు, నీకు విద్య
ఉన్న వుండు అన్ని ఊరులందికముగ!
మిత్రమా! మరువకు మేటి మాట!

ఆ.వె. అవని యందు వున్న అందగాడుల కన్న,
విద్య వల్ల వచ్చు వెలుగు తోటి,
అంద మొంది నోడె అవని యందున మిన్న!
మిత్రమా! మరువకు మేటి మాట!

- మా. శ్రీ. రాజు

"నేను యిప్పుడు చాలా మారిపోయాను. నాకు 'తాగుడు' అంటె ఏమిటో అస్సలు తెలీదు. నన్ను నమ్మండి. నన్ను మీలో ఒకడుగా స్వీకరించండి." అని అందామని పొద్దున్నించి అక్కడే తచ్చాడుతున్నాను. కాని ఎవరూ నన్ను పట్టించుకోవడం లేదు. చాలాసేపటి తర్వాత.

నా పెద్ద కూతురు యివతలకి వచ్చింది. తనని చూడగానే అభిమానంతో నా మనసు వుప్పొంగి పోయింది. "నేను మీ నాన్న నమ్మా!" అనాలని గొంతు విప్పాను. నా గొంతులోంచి చిత్రంగా భౌ..... భౌ.... అనే వింత ధ్వని వస్తోంది. కాని మాటలు రావడం లేదు. ఆమె నన్ను చూసింది. అసహ్యించుకుంది. సునీత ఎవర్ని చూసి విసుక్కుం టున్నది? ఎవర్ని చూసి! నాకు అర్థం కాలేదు. దిక్కులు చూస్తూ నించున్నాను వెళ్లకుండా.

"ఛీ.... ఛీ... వెధవ కుక్క. పొద్దున్నించీ యిక్కడే చస్తున్నాది. ఎంత తోలినా వెళ్లడం లేదు." సునీత విసుక్కుంటే, సత్యవతి యివతలకు వచ్చి చూసింది. నా భార్యని చూడగానే నా కడుపు తరుక్కుపోయింది. పాపం బాగా నీరసించిపోయింది. ముతక చీర కట్టింది. ముఖంలో జీవకళ లేదు. నుదుట బొట్టు లేదు.

"పోనీలేవే పాపం. దానికి ఆకలేస్తోందో ఏమిటో! ఇంత అన్నం తెచ్చి వేస్తానుండు." అంటూ లోపలికి వెళ్లి అన్నం ఆకులో వేసి తెచ్చి నా ముందు పెట్టింది. అన్నం చూడగానే ఆకలి గుర్తుకొచ్చింది. ఆవు రావురుమంటూ అన్నమంతా తినేశాను.

"సత్యవతీ! నేను.... నీ మొగుడ్ని.... నన్ను పోల్చుకోలేదూ?" అని అందామని నోరు తెరిచాను కాని నా గొంతులోంచి భౌ.... భౌ... శబ్దం తప్ప మరేదీ రావడం లేదు.

నాకు ఏడుపొచ్చింది. నా పెళ్లాం నన్ను గుర్తు పట్టలేదు. నా పిల్లలు నన్ను గుర్తు పట్టలేదు. అంటే.... అంటే ఒక్కసారిగా వాస్తవం నా కళ్ల ముందు నిల్చింది.

నేను..... యిప్పుడు.... శునకాన్ని. సుబ్బారావుని కాను.

గుండెల్ని పిండేసే బాధ ఏడుపు రూపంలో బయటకు వచ్చింది.

"ఛీ. ఛీ... ఇంటి ముందు నించుని యింటి వైపే చూస్తూ కుక్క ఏడవడం మంచిది కాదు. ఇంటికి అరిష్టం, ఎక్కడ్నుంచి వచ్చిందో? ఏమిటో? పొద్దున్నుంచి చంపేస్తోంది. దీన్ని కర్రతో కొడ్తే కాని వెళ్లదు." అంటూ సునీత పెద్ద కర్ర తీసుకొచ్చి కొట్టింది.

కుయి, కుయి మంటూ బాధగా మూలుగుతూ, నా పరిస్థితికి నేనే జాలి పడ్తూ అక్కడ్నుంచి నెమ్మదిగా కదిలాను. ❊